# వారసత్వం

**- ఆర్. మురళీకృష్ణ**

చిన్నా,

ఈ ఉత్తరం చదివేటప్పటికి నీవు పెద్దదానివై ఉంటావు. ఇది చదివి అర్థం చేసుకోగల బుద్ధి, పరిపక్వత నీకు ఉంటాయనే నా నమ్మకం. ఆవేశంతో, ఉద్వేగంతో చదివేవు సుమా ! నెమ్మదిగా చదువు, నింపాదిగా చదువు. ఏ భాషా వ్యక్తం చేయలేని బాధను, భావాలను, మమతను నీతో పంచుకోవాలనే ఓ నిస్సహాయురాలైన తల్లిగా నేను పడ్డ తపనే యీ ఉత్తరం.

చిట్టీ ! నవమాసాలు మోసి, అనేక కష్టాలకోర్చి, ఓ ప్రాణికి జన్మనిచ్చే మాతృమూర్తి, ఆ చిన్ని ప్రాణం పెరిగి, పెద్దదవుతూ, తడబడె నడకలతో, ముద్దు ముద్దు మాటలతో మురిపిస్తూంటే చూసి, ఆనందంతో తాను పడ్డ కష్టాన్ని మరిచిపోతుంది. ఏ సంపదా, ఆస్తి యివ్వలేని సంతృప్తిని, ఆనందాన్ని పొందుతుంది. అటువంటి అదృష్టం నాకు లేకుండా పోయింది. కన్నా, నీ ఆటపాటలు, మురిపాల మాటలు చూసి ఆనందించే వరానికి నేను నోచుకోలేదు. ఆ భాగ్యాన్ని ఆ దేవుడు నొసట వ్రాయలేదు. ఈ నా బాధ, వేదన ఏ తల్లికీ వద్దు. రాకూడదు.

చిన్నా ! కేవలం కొన్ని రోజుల ఆయుర్దాయం ఉన్న ఓ తల్లి, కొన్నిరోజుల పసిగుడ్డుకి తన గుర్తుగా, ఆస్తిగా, వారసత్వంగా ఓ ఉత్తరం వ్రాయవలసిన దుర్గతి పడితే ఆ తల్లి ఏం వ్రాస్తుంది ? తన ఆశలనా, ఆశయాలనా, కలలనా, కన్నీళ్ళనా ? వంద సంవత్సరాల ఊసుల్ని, ఆశలను, కోరికలను ఓ చిన్న ఉత్తరంలో వ్రాయగలదా ? నా పిచ్చిగాని, తల్లిప్రేమను, ఆవేదనను సంపూర్ణంగా వ్యక్తం చేసే శక్తి ఏ భాషకైనా ఉందా ? కాని తప్పదు. వ్రాసిన వాటిని చదివి, వ్రాయని వాటిని, నీవు చూడలేకపోయిన నీ కన్నతల్లిని, నీ తల్లి పడ్డ వేదన అర్థం చేసుకుంటావు కదూ ! అనంతమైన ఆకాశాన్ని గుప్పెట్లో పట్టే ప్రయత్నం.

ఇక చదువు

నేను చాలా క్రమశిక్షణతో పెరిగాను. సంపన్న కుటుంబం కాకపోయినా సదాచారం కల కుటుంబం. పిల్లలందరిలో నేనే చిన్నదాన్ని. అల్లారు ముద్దుగా పెరిగినా, ఆటల్లో, చదువులో ముందుండేదాన్ని. పిల్లలందరిని మంచి వ్యక్తిత్వం కలవాళ్ళుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు మా నాన్నగారు. ఆటపాటలతో పాటు చిన్నప్పటి నుండి పుస్తకాలు చదవటం నాకు ఓ వ్యసనంగా మారింది. నా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకోవటంలో అవి ఎంతో ఉపకరించాయి.

కాలేజి చదివే రోజుల్లో మీ నాన్నగారితో పరిచయం కలిగింది. మీ నాన్నగారికి నా అన్నవాళ్ళు లేరు. ఓ అనాథాశ్రమంలో పెరిగారు. చిల్లర మల్లర ఉద్యోగాలు చేస్తూ చదువు కొనసాగించేవారు. చాలా ఉన్నతమైన ఆశయాలు, ఆలోచనలు కలిగి ఉండేవారు. ఎప్పుడూ ఓరకమైన అశాంతితో, ఉద్వేగంతో ఉండేవారు. అలాంటివారి పట్ల ఆకర్షితురాలనయ్యాను. మా వ్యవహారం పెళ్ళిదాకా వెళ్ళింది. కాని మా వాళ్ళు ఒప్పుకోలేదు. ఊరు, పేరు, బంధు బలగం, కులం గోత్రం, ఉద్యోగం, సద్యోగం అన్నీ ఆటంకమయ్యాయి. వాళ్ళ అంగీకారం లేకుండానే మా వివాహం జరిగింది. ఊహించినట్లుగానే మా వాళ్ళు నన్ను కాదనుకున్నారు. నేను పెద్దగా పట్టించుకోలేదు. నా భావిని నిర్ణయించుకునే వివేకం, అధికారం నాకున్నాయనే నా నమ్మకం.

ఆర్థికంగా యిబ్బందులున్నా ప్రేమ, అభిమానాలకు మా ఇద్దరి మధ్యా ఎటువంటి లోటు ఉండేది కాదు. భవిష్యత్తు గురించి అందమైన కలలు కనేవాళ్ళం. మా ఆశలు, ఊసులు, కలలన్నీ నీ చుట్టే అల్లుకునుండేవి. కాని విధి వక్రించింది. స్నేహితుని పెళ్ళికని వెళ్ళి బస్సులో తిరిగి వస్తున్న మమ్మల్ని కాలం ఏక్సిడెంట్ రూపంలో విడదీసింది. మీ నాన్నగారు పోయారు. ఆ సమయంలో మీ నాన్నగారి స్నేహితులు బాగా ఆదుకున్నారు. విషయం తెలిసినా మా వాళ్ళు పంతం మానలేదు. ఆయన పోయిన కొన్ని నెలలకు నీవు పుట్టావు. నా జీవితానికి ఓ లక్ష్యం ఏర్పడినట్లైంది. కాని ఆ ఆనందం కూడా ఎంతో కాలం నిలువలేదు. ఏక్సిడెంట్లో బయట

పడకుండాపోయిన internal injuries తరువాత తీవ్రరూపం దాల్చాయి. మీ నాన్నగారి ఆప్తమిత్రులైన డాక్టర్‌గారు చాలా సహాయం చేశారు. నా ఆరోగ్యం గురించి, నీ భవిష్యత్తు గురించి వారితో విస్తృతంగా చర్చించాను. తరచి, తరచి అడిగినప్పుడు గాని వారు చెప్పలేదు. నేను జీవించే అవకాశాలు తక్కువని. ఆ ఆశనిపాతాన్ని సైతం తట్టుకున్నాను. నీ భవిష్యత్తు గురించి ధైర్యం చెప్పారు. తన స్వంత కూతురిలా పెంచుకుంటానన్నారు. నా కన్నీళ్ళతో వారి చేతులు తడిపేసాను. అప్పటికే వారికి పిల్లలున్నారు. ఆయన్ని నేనింకొక సహాయమర్థించాను. అది నీ గతం నీకు తెలియకూడదని, దానికాయన సమ్మతించారు.




రోజులు గడుస్తున్న కొద్దీ నా ఆరోగ్యం దిగజార సాగింది. నా ఆలోచనలన్నీ నీ గురించే. రేపు, నీ గురించి తెలిసిన వాళ్ళు నీవో అనాథవని, నీ వాళ్ళనుకున్న వాళ్ళు, నీ వాళ్ళు కాదన్న నిజాన్ని నీకు చెబితే నీ లేత మనస్సు తట్టుకోగలదా ? నీ మానసిక స్థితి ఎలా ఉంటుంది ? బాగా ఆలోచించి, నీ గతం అవసరమయితే నీకు యీ నా ఉత్తరం ద్వారా తెలియటం ఉత్తమం అని భావించాను. క్లుప్తంగా యిది నీ తల్లిదండ్రుల గతం. ఈ ఉత్తరంతో పాటు మా యిద్దరి ఫోటో, కొన్ని వివరాలు ఉన్న కాగితం ఉంచాను. ఇక మిగతా విషయాలు అనవసరం.

కన్నా ! చెట్టుకు వేరు ఎంత ముఖ్యమో మనిషికి తన గతం, తన పరంపర అంత ముఖ్యం. జీవితంలో ఒడుదుడుకులను తట్టుకునేందుకు, అస్థిత్వం, ఉనికి అవగాహనకై యీ విషయాలు తెలియటం అవసరం. ఇవి ఓడకి లంగరులా, చుక్కానిలా ఉపకరిస్తాయి. వీటి గురించి తెలియకపోవటం జీవితంలో ఒక పెద్ద బలహీనతగా మిగిలిపోతుంది. మీ నాన్నగారి విషయంలో జరిగిందదే. ఆయన అశాంతికి కారణమదే. నా అన్నవారు, నాది అనేది లేకపోవటం. స్వయంగా ఆయనే చెప్పుకునేవారు. ఆ అభద్రతా భావం నీకు కలుగకూడదు. ఆ కొరత నీకు రానీయను. అందుకే యీ ఉత్తరం. నీవు అనాథవు కాదు, నీకు తల్లి తండ్రి ఉండేవారని, వారు సభ్య సమాజంలో గౌరవంగా బ్రతికారని, నీవు నిర్భయంగా చెప్పుకోగలగాలని, తలెత్తుకుని జీవితంలో సాగాలన్నదే నా ఆకాంక్ష. నీ గురించి నిజం నీకు తెలియాలన్నదే నా కోరిక. నీ గతం నేను నీకివ్వాలనుకున్న కానుక. ఓ నిరుపేదరాలి వారసత్వం. అర్థం చేసుకుంటావు కదూ !

చివరిగా ఓ రెండు మాటలు. నీ జీవితం నీది. అది ఏ బాటలో సాగాలి, ఎలా సాగాలి, ఏ విధంగా ఉండాలన్నది నీ హక్కు. కాని ఒక్క విషయం. నీవు ఎవరిపైనా ఆధారపడకూడదు. నీ కాళ్ళపై నీవు నిలబడాలి. ఇంకొక్క విషయం. తెలిసి, తెలిసి ఎవరికీ హాని తలపెట్టకు. కీడు కలిగించకు.

చిన్నా, ఉంటానమ్మా. యింతకంటె ఎక్కువ. వ్రాయలేకపోతున్నాను. నీ పిల్లలకి యీ అమ్మమ్మ, తాతయ్య గురించి చెబుతావు కదూ ! మరచిపోకేం.

అమ్మ